# బెండు అప్పారావు

సృజనాత్మకతకు ప్రాధాన్యమిచ్చే తెలుగు సినీ దర్శకుల్లో ఇవివి సత్యనారాయణది ఒకరు. మానవత్వాన్నీ, సెంటిమెంటునీ సరైన పాళ్లలో మేళవించే ఆయన సబ్జక్టు సామాన్యుల అవగాహనకు దగ్గర్లో ఉంటాయి. అప్పుడప్పుడు కొంత చౌకబారుతనం చోటు చేసుకున్నా- కొత్తదనానికి పెద్దపీట వేసే ఆయన చిత్రాల్లో ప్రేక్షకుడికి నూటికి నూరుపాళ్లు సంతృప్తినిచ్చేవి చాలానే ఉన్నా- సంతృప్తిలో 60 శాతం దిగువన ఉండేవి చాలా తక్కువనే చెప్పాలి.

కళని వ్యాపారంతో ముడిపెట్టే ఫార్ములాని ఔపోసన పట్టిన తెలుగు సినీ నిర్మాతల్లో డి రామానాయుడు ఒకరు. అందుకే ఆయన తీసిన చిత్రాల్లో చాలావరకూ మంచివి, గొప్పవి అనిపించుకుంటూనే విజయవంతమూ అయ్యాయి.

ఒడ్డూ పొడవూ ఉన్న అల్లరి నరేష్ రూపంతోకంటే నటనతో నిలదొక్కుకున్నాడు సినీరంగంలో. రాజేంద్రప్రసాద్ తరహా కామెడీలకి పరిమితమైనా- నటనలో ఆయన్ను అనుకరించని నరేష్‌కి తనదంటూ ఓ బాణీ లేదు. ఎందుకంటే- ఏ సినిమాలోనూ అతడు నటిస్తున్నట్లు తోచదు. నిత్య జీవితంలో తెలిసిన మనిషిని చూస్తున్నంత సహజంగా అనిపించే అతడి నటన చాలామంది తెలుగు హీరోలకి భిన్నం. డైలాగ్ డెలివరీలో, నటనలో టైమింగ్‌తో ప్రేక్షకుల్ని అవలీలగా నవ్వించగల అరుదైన చాతుర్యం నరేష్‌ది. అందుకేనేమో కె విశ్వనాథ్ అంతటి దర్శకుడు తన కొత్త సినిమా శుభప్రదంకు అతణ్ణి హీరోగా ఎన్నుకున్నాడు. ఆ వివరాలు మరోసారి!

గత సంవత్సరం (2009) అక్టోబరు 16న విడుదలై- ఈ సంవత్సరంలో కొంతకాలందాకా నడిచిన 'బెండు అప్పారావు' చిత్రం ఈ ముగ్గురి కాంబినేషన్లో వచ్చింది.

ఈ చిత్రంలో నరేష్ (బెండు అప్పారావు) ఆర్‌ఎంపి డాక్టరు. ఊరు బొబ్బర్లంక. తన చెల్లెలి శాడిస్టు భర్త (కృష్ణ భగవాన్) గొంతెమ్మ కోర్కెలు తీర్చడంకోసం- అతడు పల్లెప్రజల్ని వైద్యం పేరుతో మోసం చేసి డబ్బు సంపాదిస్తూంటాడు. హస్తవాసి మంచిది కావడంవల్ల అతడివల్ల ఎవరికీ ఆరోగ్యపరంగా ప్రమాదం వాటిల్లలేదని మనం నమ్మాలి. తెరమీద హీరోనైతే మన్నించగలమేమో కానీ నిజ జీవితంలో అలాంటి మోసగాణ్ణి ఏమాత్రం క్షమించలేం. ఏదేమైనా ఆ ఊరి భూస్వామి మర్యాదల రాజు (ఆహుతి ప్రసాద్) కూతురు (కామ్‌నా జెఠ్మలానీ) అతణ్ణి వలచి వలపింపజేసుకుంది కూడా. అడ్డదారిలో డబ్బు సంపాదించి సుఖజీవనం చేయాలనుకునే ఇద్దరు మిత్రులతో (ఉత్తేజ్, శ్రీనివాసరెడ్డి) కలిసి వెడుతుండగా- యాక్సిడెంట్‌కి గురై కొన ఊపిరితో ఉన్న ఓ యువకుడు అతడికి తటస్థపడ్డాడు. తన దగ్గిరున్న పదిహేను లక్షలూ నరేష్‌కిచ్చి- తనవారికి అందజేయమని కోరి కన్ను మూసాడతడు. నరేష్ ఆ యువకుడి కుటుంబాన్ని కలుసుకుందుకు చాలా ప్రయత్నాలు చేస్తాడు. ఈలోగా అతడి మిత్రులు ఓ పన్నాగం పన్ని- ఆ యువకుడి కుటుంబంలో

అంతా చనిపోయినట్లు నరేష్‌ని నమ్మిస్తారు. నరేష్ మిత్రులకి కొంత డబ్బిచ్చి మిగతా డబ్బుతో ఆ యువకుడి పేరుమీద మంచి పనులు చేస్తాడు. ఈలోగా ఆ యువకుడి తలిదండ్రులు, చెల్లెలు (మేఘన) ఆ ఊరికే వస్తే- నిజం తెలిసి కష్టాల్లో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకుంటాడు. తన ప్రేమని త్యాగం చేసి మేఘనని పెళ్లి చేసుకోవాలని కూడా అనుకుంటాడు. అంతలో ఊరికి మంచి చెయ్యకపోయినా మంచి చేసేవాళ్లని భరించలేని ప్రెసిడెంటు (చలపతిరావు)- నరేష్ డబ్బెవరిదో అసలు రహస్యం బయటపెడతాడు. అపవాదు, అపార్థాలనుంచి నరేష్ అగ్నిపునీతుడు కావడం- మిగతా కథ!

నిజానికి కథ చాలా బలమైనది. దర్శకుడూ అంత బలమైనవాడు కావడంవల్లనేమో- ఉష్ణం ఉష్ణేన శీతలం సామ్యంలో బలం నిర్బలమైంది. చాలా గొప్ప సన్నివేశాలు చప్పగా తేల్చేయడం- ఈ చిత్రంలో ప్రత్యేకత (నరేష్ డబ్బుని పోస్టుబాక్సులో దాచి సన్నివేశం ఓ ఉదాహరణ). హాస్యానికి ప్రాధాన్యమివ్వాలనుకోవడం- అందుక్కారణమైతే- ఈ చిత్రంలో హాస్యనటులందరూ గొప్పగా నటించారు. డైలాగ్సుకూడా బాగా రాణించాయి. కథ, కథనం ఎంత బలహీనంగా ఉన్నాయంటే- మేఘనకు హీరోతో ఓ పాట- సినిమాహాల్లో ఎక్స్‌ట్రా సీట్‌లా ఏర్పాటు చేసారు. దానికి తగ్గట్లే పాటలూ అంత హుషారుగా అనిపించవు. నరేష్ పాటల నటుడు కూడా కాదు మరి!

ఈ సినిమాలో అతిథి మర్యాదలు చేయడానికి ప్రధానమిచ్చే భూస్వామి పాత్ర సహజమైనది, విశిష్టమైనది. ఆహుతిప్రసాద్ ఆ పాత్రలో జీవించి ఈ సినిమాకు సంబంధించి నటనలో తనదే ప్రథమస్థానం అనిపించుకున్నాడు. నరేష్ ఇంచుమించు ఆయనకి దీటుగా నటించాడు. కామ్‌నా జెత్మలానీకి పల్లెటూరి తెలుగమ్మాయి గెటప్ నప్పినా- ప్రియుడికోసం ఆమె తాపత్రయం, హాస్యం పేరిట బామ్మని (తెలంగాణా శకుంతల) ఇబ్బంది పెట్టిన తీరు- అసంబద్ధంగా ఉన్నాయి. కృష్ణ భగవాన్ డైలాగ్ టైమింగ్ ఎంత బాగుందో- అతడిలో మార్పుకి టైమింగ్ అంత బాగోలేదు.

బెండు అప్పారావు- హస్తవాసిని నమ్ముకున్న ఓ డాక్టరు కథ. ఈ చిత్రవిజయం హస్తవాసినే నమ్ముకున్న నిర్మాత-దర్శకుడు-హీరోల కథ. ఎవరికీ ఇది మా చిత్రం అని గర్వపడాల్సిందేమీ లేని- ఈ చిత్రం ప్రేక్షకులకి పెద్దగా అసంతృప్తి కలిగించకపోయినా- గుర్తుంచుకోతగ్గదీ కాదు. ఐతే ఈ చిత్రవిజయం కొత్తగా సినీరంగంలో అడుగెడుతున్నవారికి తప్పుడు సంకేతాలనిచ్చే ప్రమాదముంది. బెండు అప్పారావులా జ్ఞానం కంటే- హస్తవాసినే నమ్ముకోవడంలో విజ్ఞతను ఎవరికివారే అంచనా వేసుకోవాలి.